# నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, గురువారం 22 మే 2025 | MEDAK





గజగట్లపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నశంకరంపేట, మే 21: అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లిలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు గవ్వలపల్లి చౌరస్తాలో హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గవ్వలపల్లి చౌరస్తా నుంచి గజగట్లపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జెండాను, అంబేద్కర్ విగ్రహాన్ని హరీశ్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, జితేందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మీనా రవీందర్, లింగంరాజ్, రవీందర్‌రెడ్డి, యాదగిరి యాదవ్ లక్ష్మణ్ స్వామి, ప్రభాకర్, సుధాకర్‌నాయక్, ప్రసాద్‌గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పాలన చేతకాక కాంగ్రెస్ కుట్రలు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల, మే 21: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వ్యవసాయాన్ని పండుగ చేసిన కేసీఆర్ చరిత్ర సృష్టించారని, కాంగ్రెస్ సర్కారు కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక విచారణ పేరిట కాళేశ్వరం కమిషన్ నుంచి నోటీసులు జారీచేయించిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు విచారణ అంటూ నోటీసులు జారీ చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారుపై తెలంగాణ ప్రజలు మరోసారి మర్లపడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల కష్టాలు తెలిసిన మహానాయకుడు కేసీఆర్ మాత్రమేనని, అందుకే ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగునీరు అందించి వారికి అండగా ఉన్నటు తెలిపారు.తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను వేధింపులకు గురిచేసి, ఇబ్బందులు పెట్టేందుకే విచారణ రావాలని నోటీసులు జారీచేసినట్లు ఆరోపించారు. పదేండ్లలో కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో నెంబర్‌వన్ చేశారని, రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అన్ని దేశాలు మెచ్చుకున్నాయని, కేసీఆర్ గుర్తులు చెరపాలనుకుంటే మీతరం కాదనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కేసీఆర్ పాలననే గుర్తు చేసుకుంటున్నారని, కేసీఆర్ కట్టించిన కట్టడాలు, అభివృద్ధిని చూసి దేశవిదేశీయులు ప్రశంసిస్తున్నట్లు తెలిపారు.

## డిఫెన్స్ రంగంలో విస్తృత పరిశోధనలు

- ఆర్మీకి ఉపయోగపడేలా డ్రోన్ల తయారీపై దృష్టి
- పరిశోధనలకు రూ.325 కోట్ల నిధులు
- సెమి కండక్టర్ల రంగంలో తైవాన్‌తో కలిసి మరిన్ని పరిశోధనలు
- ఐఐటీహెచ్‌లో జపాన్, ఆస్ట్రేలియా జాయింట్ రీసెర్చ్ సెంటర్లు
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



కందిలోని ఐఐటీహెచ్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ బీఎస్‌మూర్తి

సంగారెడ్డి, మే 21(నమస్తే తెలంగాణ): దేశ రక్షణకు కావాల్సిన ఆయుధాల తయారీకి సంబంధించి మరిన్ని పరిశోధనలు చేస్తామని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. బుధవారం ఐఐటీహెచ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇటీవల భారత్ విజయవంతంగా ఆపరేషన్ సిందూరు నిర్వహించిన నేపథ్యంలో ప్రతి పౌరుడిలో దేశం ముఖ్యం అన్న భావన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. త్రివిధ దళాలకు ఉపగపడేలా అధునాతన ఆయుధాలు అందించేందుకు అవసరమైన పరిశోధనలపై ఐఐటీహెచ్ దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇదివరకే ఐఐటీహెచ్‌లో ఆర్మీకి సంబంధించిన కేంద్రం ఏర్పాటు చేశామని, త్వరలోన నేవీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఐ ఆధారిత డ్రోన్ల తయారీ, ఎయిర్ అంబులెన్స్‌ల తయారీపై పరిశోధనలు సాగిస్తున్నట్లు చెప్పారు. 200 కిలోల పేలోడ్ తీసుకెళ్లేలా డ్రోన్ తయారీకి సంబంధించిన పరిశోధనలు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. పరిశోధనలకు సంబంధించి ఐఐటీహెచ్ వద్ద రూ.325 కోట్ల నిధులు ఉన్నట్లు తెలిపారు. జపాన్‌తో కలిసి త్వరలోనే ఐఐటీహెచ్‌లో జాయింట్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీలో ఐఐటీహెచ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెమి కండక్టర్ల రంగంలో అనేక కొత్త పరిశోధనలు తాము కొనసాగిస్తున్నట్లు డైరెక్టర్ బీఎస్ మూర్తి చెప్పారు. తైవాన్ నేషనల్ యూనివర్సిటీతో కలిసి సెమి కండక్టర్లకు సంబంధించి సంయుక్తంగా పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. సెమికండక్టర్ల రంగంలో ప్రతిష్టాత్మకమైన పలు కంపెనీలు తమతో కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. జపాన్‌లోని ప్రముఖ యూనివర్సిటీలతో కలిసి స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఐఐటీహెచ్‌తో దేశంలోని పలు ఐఐటీలు, ఎన్ఐటీలకు చెందిన 55 మంది పీహెచ్‌డీ విద్యార్థులు జపాన్‌లోని వేర్వేరు యూనివర్సిటీల్లో పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో దేశం నుంచి జపాన్‌కు వెళ్లే పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్య 300కు పెరగనున్నట్లు తెలిపారు. జపాన్ వెళ్లి పరిశోధనలు చేసే పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్య 3వేలకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా ఐఐటీహెచ్ పనిచేస్తున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన సుజకితో పాటు ప్రముఖ పారిశ్రామిక కంపెనీలు ఉండే హామమట్సు పట్టణ మేయర్ ఇటీవల ఐఐటీహెచ్‌ను సందర్శించినట్లు తెలిపారు. వచ్చే నవంబర్‌లో ఐఐటీహెచ్‌లో హామమట్సు డే నిర్వహించనున్నట్లు చెప్పారు. హామమట్స డేలో భాగంగా ఆప్రాంతంలోని పరిశ్రమలు ప్రతినిధులు ఐఐటీహెచ్‌కు రానున్నట్లు డైరెక్టర్ బీఎస్ మూర్తి చెప్పారు.

## ఆగిన పనులు

కొండాపూర్, మే 21: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో వాగులు, చెరువుల ఆక్రమణలపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈనెల 14న 'వాగు మాయం'..అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి రియల్టర్లు చేపడుతున్న సీసీ పనులు ఆపించారు. అధికారుల హెచ్చరికలతో రియల్టర్లు పనులు ఆపివేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ఇరిగేషన్ అధికారి సుమంత్‌రెడ్డిని వివరణ కోరగా.. పనులు తక్షణమే ఆపాలని ఆదేశించామన్నారు.

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనం

### వాగు మాయం..!



# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

### జహీరాబాద్ ప్రాంతానికి కాంగ్రెస్ సర్కారు చేసిందేమీ లేదు

- సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిదిలా సీఎం రేవంత్ తీరు
- కాంగ్రెస్ పాలనలో రైతుల అరిగోస
- వానకాలం వస్తున్నా పచ్చిరొట్టె విత్తనాలు ఇప్పటికీ పంపిణీ లేదు
- విత్తనాల ధరలు పెంచినా అందుబాటులో లేవు
- రైతులకు అందని రైతుభరోసా
- ధాన్యం కొనుగోలులో సర్కారు విఫలం
- జహీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి జాడీమల్కాపూర్ దుర్గాదేవి జాతరకు హాజరైన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు గజమాలతో స్వాగతం పలుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



జాడీమల్కాపూర్ గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

జహీరాబాద్, మే 21: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ చేసిందేమీ లేదని, బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఈనెల 23న జహీరాబాద్ పర్యటనకు సీఎం రేవంత్ ఏముఖం పెట్టుకొని వస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం జాడీ మల్కాపూర్‌లోని దుర్గాదేవి జాతరకు ఆయన హాజరయ్యారు. అనంతరం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో మంజూరైన పథకాలకు ప్రారంభించడం చూస్తే సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్నట్లుగా సీఎం రేవంత్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో నిధులు మంజూరు చేసి నిమ్జ్ రోడ్డు, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు తామంతా కృషి చేశామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జహీరాబాద్ నుంచి బీఆర్‌ఎస్ ఎంపీగా బీబీపాటిల్ ఉన్నప్పుడు తాము కేంద్రం దృష్టికి తీసుకెళ్లి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించినట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం ప్రారంభమై విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో దానిని ప్రారంభించడానికి సీఎం వస్తుండడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్ ప్రాంత ప్రజల మీద సీఎం రేవంత్‌రెడ్డికి నిజంగా ప్రేమ ఉంటే వాపస్ తీసుకున్న నిధులను వెంటనే ఇవ్వాలన్నారు. పాతవి కొత్తవి కలిసి రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సర్పంచులు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

### కాంగ్రెస్ పాలన రైతులకు ఇబ్బందులు...

కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో వర్షకాలం సీజన్ ప్రారంభమైందన్నారు. రైతులు సాగు చేసేందుకు అవసరమయ్యే జీలుగ, జనుము విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ముందుగానే స్టాక్ పెట్టి అందుబాటులో ఉంచేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మద్యం ధరలతో పాటు జీలుగ, జనుము విత్తనాల ధరలను పెంచిందన్నారు. వానకాలం సీజన్‌కు విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కి అప్పజెప్పినా కేంద్రం విత్తనాలు ఇవ్వ డం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విత్తనాలు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. వర్షాలకు ధాన్యం తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతులకు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర మంత్రులు, సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించిన దాఖలాలు లేవన్నారు. ధాన్యం కోనుగోలులో తరుగు పేరిట రైతులకు నిలువునా దోచుకొని అన్యాయం చేస్తున్నారన్నారు. యాసంగి సీజన్‌లో సన్నబియ్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం బోగస్ చేసిందన్నారు. రైతులకు చెల్లించాల్సిన రూ. 850 కోట్ల బోనస్‌లో ఒక రూపాయి చెల్లించలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేసిందన్నారు. రైతుబంధు కింద జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలకు రూ. 100 కోట్లకు పైగానే రైతులకు ఆర్థిక సహాయం వచ్చేదన్నారు. వానకాలం, యాసంగి సీజన్లకు గత ప్రభుత్వంలో ఎకరానికి రూ. 10 వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ. 15 వేలు ఇస్తామని మూడు ఎకరాలకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొందన్నారు. నోట్ల రద్దు, కరోనా వచ్చినా ఎప్పుడూ రైతుబంధు ఆగలేదన్నారు. రెండు పంటలకు సంబంధించి రైతుబంధును ప్రభుత్వం ఇవ్వలేదన్నారు.ఫిబ్రవరిలో రైతుబీమా పథకానికి చెల్లించాల్సిన ప్రీమియం డబ్బులను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు వివిధ కారణాలతో మృతిచెందిన పరిహారం రాకపోవడంతో రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, పేదలు, రైతులకు కేసీఆర్ పంచిపెట్టారని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మద్యం ధరలు పెంచి, చివరికీ విత్తనాల ధరలు కూడా పెంచుతావా అంటూ రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులు, పేద ప్రజల రక్తమాంసాలను పీలుస్తూ ప్రజల నుంచి సొమ్మును గుంజుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో ఎరువుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించినప్పటికీ, నేటికి అమలు కావడం లేదన్నారు. గతేడాదితో పాటు ఈసారి పంట నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో 21 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేపడుతున్నప్పటికీ, రైతులకు చెల్లించాల్సిన రూ. 72 కోట్లను ఇప్పటికీ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. 48గంటల్లో జొన్న డబ్బులు చెల్లిస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పినా, 48 రోజులైనా చెల్లించలేదన్నారు. సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు మాణిక్యం పాల్గొన్నారు.

# సనాతన ధర్మం గొప్పది





సిద్దిపేట పట్టణంలోని మోహిన్‌పురా వేంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకంలో చినజీయర్ స్వామి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

- నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని కొలవాలి
- స్వర్ణోత్సవ మహోత్సవాల్లో చినజీయర్‌స్వామి

సిద్దిపేట టౌన్, మే 21: సనాతన ధర్మం ఎంతో గొప్పదని, నిర్మలమైన మనస్సు.. నిశ్చలమైన దీక్షతో భగవంతుడిని కొలిస్తే అంతా మంచి జరుగుతుందని చినజీయర్ స్వామి అన్నారు. సిద్దిపేటలోని మోహిన్‌పురా వేంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా కుంభాభిషేకం మహాఘుట్టం వైభవంగా నిర్వహించారు. చినజీయర్ స్వామితో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చినజీయర్ స్వామి ప్రవచనాలు ఇస్తూ.. మానవుడు ఆ భగవంతుడికి కృతజ్ఞతగా ఉండాలన్నారు. సిద్దిపేట నడిబొడ్డున 50 ఏండ్ల క్రితం పెద్దజీయర్ స్వామి చేతుల మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రతిష్ఠించబడి, ఈ ప్రాంత ప్రజలను వేంకటేశ్వర స్వామి చల్లగా చూస్తున్నాడన్నారు.సనాతన ధర్మాన్ని అందరూ పాటించాలని, ధర్మాన్ని మనం కాపాడితే.. మనల్ని ధర్మం కాపాడుతుందని అన్నారు. హరీశ్‌రావు ఈ ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని చినజీయర్ స్వామి కొనియాడారు. హరీశ్‌రావు ప్రజా నాయకుడని, ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని, సిద్దిపేటను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపారని చినజీయర్ స్వామి అభినందించారు.


### ఆధ్యాత్మిక.. ధార్మికతకు నెలవు సిద్దిపేట: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆధ్యాత్మికత, సేవాపరులకు నిలయంగా సిద్దిపేట విరాజిల్లుతున్నదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆనాడు పెద్ద జీయర్ స్వామి పెట్టిన ముహూర్తమే నేడు స్వర్ణోత్సవ సంబురానికి వేదికైందన్నారు. ఆలయ వేడుకకు చినజీయర్ స్వామి రాకతో సిద్దిపేట పునీతమైందన్నారు. చినజీయర్ స్వామితో ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారితో తమకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. బ్రహోత్సవాలకు స్వామి వారు మూడు రోజుల సమయం ఇవ్వడం మనందరి అదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. జీయర్ స్వామి మాట్లాడుతుంటే భగవద్గీతను చదివినట్లుగా.. రామాయణాన్ని విన్నట్లుగా ఉంటుందన్నారు. ఈ ఆలయం ప్రతిష్ఠించినప్పటి నుంచి నేటి వరకు నిత్య పూజలు చేయడం ఆషామాషి విషయం కాదని, ఏడుకొండల వెంకన్న స్వామి కృపా కటాక్షాలతోనే ఇది సాధ్యమైందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా దేవుడి సేవలోనే తృప్తి లభిస్తుందన్నారు. అన్నదాన సత్రానికి అవసరమైన గ్రానైట్‌ను త్వరలోనే అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో చినజీయర్ స్వామి శిష్యబృందం, ప్రజాపతినిధులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# పైసా వసూల్!

### చేయి తడిపితేనే కల్యాణలక్ష్మి చెక్కులు

- సకాలంలో అందక ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు
- పైసలు ఇచ్చిన వారి చెక్కులు క్లియర్
- తహసీల్ కార్యాలయాల్లో కాంగ్రెస్ నేతల ఆగడాలు
- జిల్లాలో వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు
- నెలల తరబడి లబ్ధిదారుల ఎదురుచూపులు



సిద్దిపేట, మే 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతున్నది. చేయి తడపనిదే ప్రజలకు పనులు కావడం లేదు. రాష్ట్రంలో మా ప్రభుత్వం ఉంది.. మేము ఏం చెబితే అదే నడుస్తుంది.. మేము అడిగినంత డబ్బులు ఇస్తేనే మీకు పనులు అవుతాయి..ప్రతి పనికి డబ్బులు ఇవ్వాల్సిందే. ఇలా ఇస్తేనే పనులు అవుతాయి అంటూ లబ్ధిదారుల వద్ద కొందరు కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రతి పనికి ఏదో ఒక రకంగా డబ్బులు వసూలు చేయడం పనిగా పెట్టుకున్నారు. ఇటీవల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి అందినకాడికి పైసలు వసూలు చేస్తున్నారు.వీరికి కొందరు రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కల్యాణలక్ష్మి పథకానికి ఆదాయ, కుల సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పనులు కావడంలో లేదు. ప్రతి దానికి ఒక రేటు ఫిక్స్ చేసి, ఆ రేటు ప్రకారం డబ్బులు ముట్టజెప్పితేనే పనులు చేస్తున్నారని పేదలు వాపోతున్నారు. కిందిస్థాయి సిబ్బంది ద్వారా పైసలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు జిల్లాలో బలంగా ఉన్నాయి. నెలల తరబడి కల్యాణలక్ష్మి చెక్కులు అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మండలాల్లో చెక్కులు మంజూరైనా వాటిని పంపిణీ చేయకుండా ఆపివేస్తున్నారు.దీనికి పలు కారణాలు ఉన్నాయి. జిల్లా మంత్రి సమయం ఇవ్వకపోవడంతో చాలా చోట్ల పెండింగ్‌లో పెట్టారని ఆరోపణలు ఉన్నాయి.

### పెండింగ్‌లో దరఖాస్తులు..

సిద్దిపేట జిల్లాలో వందల సంఖ్యలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా మండలాల్లో తహసీల్దార్ లాగిన్‌లోనే పెండింగ్‌లో పెట్టారు. దాదాపు అన్ని మండలాల్లో లబ్ధిదారుల నుంచి చోటాబడా నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో దరఖాస్తును క్లియర్ చేయడానికి తహసీల్ కార్యాలయంలోనే కాసుకొని కూర్చున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు మీ-సేవలో దరఖాస్తు చేసుకుంటారు. ఈ దరఖాస్తును స్థానిక తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారుడు అప్పజెప్పుతాడు. మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ స్థానిక తహసీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహసీల్దార్ దానిని పరిశీలించి ఆర్డీవోకు పంపుతారు. ఇలా ప్రాసెస్ పూర్తయ్యాక లబ్ధిదారునికి పథకం మంజూరు అవుతుంది. కానీ, ఇక్కడే అసలు తతంగం నడుస్తున్నది. ఆయా మండల కేంద్రాల్లోని స్థానిక తహసీల్ కార్యాలయ సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మక్కు అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చిన దరఖాస్తు జాబితాను కాంగ్రెస్ నాయకులకు చేరవేస్తున్నారు. ఆ జాబితా పట్టుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఫోన్ చేసి మీరు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు కదా.. మాకు రూ. 5 వేల నుంచి రూ.10 వేలు ఇవ్వాలని, ఇస్తే మీ పనులు అవుతాయని డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు కావని బెదిరిస్తున్నారు. చేసేదేమి లేక లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులకు డబ్బులు ముట్టజెబుతున్నట్లు తెలిసింది.

### సిద్దిపేట జిల్లాలో..

**కల్యాణలక్ష్మి పథకం**

| సంవత్సరం | దరఖాస్తులు | మంజూరు |
|---|---|---|
| 2022-23 | 4,689 | 4,655 |
| 2023-24 | 4,154 | 4,142 |
| 2024-25 | 4,353 | 4,318 |
| మొత్తం | 13,196 | 13,115 |

**షాదీముబారక్**

| సంవత్సరం | దరఖాస్తులు | మంజూరు |
|---|---|---|
| 2022-23 | 452 | 451 |
| 2023-24 | 450 | 449 |
| 2024-25 | 321 | 321 |
| మొత్తం | 1,223 | 1,221 |

## కొనుగోళ్లు పూర్తయ్యేదెప్పుడూ..

### ధూళిమిట్టలో వానలతో తడుస్తున్న ధాన్యం.. ఆందోళనలో రైతులు



ధూళిమిట్టలో టార్పాలిన్లతో ధాన్యం రాసులను కప్పిన రైతులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 21: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతున్నది. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో సెంటర్ వద్ద ధాన్యం రాసులతో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధూళిమిట్ట సెంటర్‌లో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనికి తోడు హమాలీల కొరత, మిల్లర్లు ధాన్యాన్ని తీసుకునేందుకు సతాయించడం వంటి కారణాలతో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్య నుంచి అధిగమించేందుకు తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతిరోజు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సమీప గ్రామాల నుంచి హమాలీలను రప్పిస్తున్నామని, నాలుగు రోజుల్లో ధూళిమిట్టలో కొనుగోళ్లను పూర్తి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా



బోరంచ శివారులో బీటలు వారిన సీసీ రోడ్డు

మనూరు, మే 21: సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని బోరంచ శివారులో వాగుకు రెండువైపులా నిర్మించిన సీసీ రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. మనూరు మండలం బోరంచ, రేగోడ్ మండలం సిందోల్ గ్రామాల మధ్యనున్న కల్వర్టు రోడ్డు కొన్ని రోజులుగా పూర్తి స్థాయిలో బీటలు వారింది. రేగోడ్ మండలం సిందోల్ మీదుగా బోరంచ శివారు వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. సిందోల్, బోరంచ గ్రామాల మధ్య ఉన్న సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయక పోవడంతో దెబ్బతిన్నది. ఈ సీసీ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. మండలంలోని బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి జాతర 45 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ జాతరకు మనూరు మండల కేంద్రంతో పాటు నారాయణఖేడ్ మండలం రుద్రారం, పంచగామ, రేగోడ్ మండలం లింగంపల్లి గ్రామాల నుంచి దారులు ఉన్నాయి. జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు ఇదే దారి నుంచి వస్తుంటారు. వర్షం పడితే రోడ్డుపై ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారుతున్నది. సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.